# రక్తసింధూరం

పాటిబండ్ల
విజయలక్ష్మి

"జస్వంత్ ! అరేయ్ ఆగరాబాబూ నేనూ వచ్చేస్తున్నా ఏమిటా పరుగు?" అంటూ గబగబా ఫైల్స్‌మూసి డెస్క్‌లో తోసి, ఒక్క పరుగులో జస్వంత్‌ను చేరుకున్నాడు మురళీకృష్ణ.

ఇద్దరూ కలసి మామూలుగా తమ ఫావరెట్ కాఫీకేఫ్‌కు చేరుకున్నారు. కాఫీకి ఆర్డరిచ్చి మౌనంగా ఏదో ఆలోచిస్తూ అలవాటుకు విరుద్ధంగా గంభీరంగా కూర్చున్న జస్వంత్ వైపు వింతగా, ఆశ్చర్యంగా చూశాడు మురళీ కృష్ణ.

"ఏవిటిరా యివాళ నీలో కొత్త కొత్త అలవాట్లు కనిపిస్తున్నాయి. నన్ను పిలవకుండా ఆఫీసునుంచి బయటకు అడుగు వెయ్యనివాడివి, నాకు చెప్పాపెట్టకుండా ముందే బయలుదేరి వచ్చావు. తీరా నేను వెంటబడి వచ్చినా ఒక్క మాట మాట్లాడటంలేదు. నువ్వు మౌనవ్రతం పడితే మటుకు భరించడం నా వల్లకాదురా. అలాగే నేను అతిగా మాట్లాడితే వినడం నీవల్లకాదని నాకు తెలుసు. అందువల్ల మన అలవాట్లకు విరుద్ధంగా ప్రవర్తించడం మనిద్దరికీ మంచిదికాదు. ఏమంటావ్?" అంటూ చిన్నగా నవ్వుతున్న మురళిమాటలకు నెమ్మదిగా పెదాలమీదకు నవ్వుతెచ్చుకోడానికి ప్రయత్నిస్తూ-

"మురళీ! పరిస్థితులు పగబట్టినప్పుడు అలవాట్లు, అవసరమైతే అనురాగాలూ, అనుబంధాలూ వదులుకోక తప్పదురా!" అంటూ విషాదంగా మాట్లాడుతున్న జస్వంత్ వైపుచూస్తూ....

"ఒరే ! ఒరే ! చూడబోతే కేసు ఏదో తీవ్రమైనట్లే వుంది. యింతకీ ఏవిటా కథ? నీ బాధేవిటిరా?"

"ఏవీలేదు ముందు కాఫీ తాగరా తర్వాత చెబుతాను" అంటూ కాఫీ కప్పు

ముందుకు తోశాడు జస్వంత్ కణతలు నొక్కుకుంటూ.

జస్వంత్ వైపు వింతగా చూస్తూ కాఫీ సిప్ చేస్తున్న మురళి ముఖంలోకి కూడా సీరియస్‌నెస్ వచ్చేసింది. విషయమేదో జస్వంత్‌కు చాలా బాధాకరమైనదని తెలిసిపోతోంది. అంటే తనకూ బాధాకరమైనదే అయ్యుంటుంది. మౌనంగా కాఫీలు తాగారిద్దరూ. జస్వంత్ వైపే వుంది మురళి దృష్టంతా. జస్వంత్ చూపులెక్కడో శూన్యంలోకి వున్నాయి.

తమ యిన్నేళ్ళ స్నేహంలో జస్వంత్‌ను అంత సీరియస్‌గా చూడటం అదే మొదటిసారి. ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూవుండే జస్వంత్ మాటలన్నా అతని స్నేహమన్నా మురళికి పాలమీగడంత యిష్టం. అప్పుడప్పుడూ సరదాగా అంటుండేవాడు కూడా! 'ఒరే జస్వంత్! పాలమీగడకన్నా పంచదార చిలకల కన్నా ఎంతో రుచిరా నీ స్నేహం' అని.

అలాంటప్పుడు జస్వంత్ నవ్వుతూ "పాలమీగడ నీకిష్టమైతే అందరికీ ఇష్టం కాదురా ఫూల్. అదేం పోలిక" అంటూ ఎగతాళిచేసేవాడు.

"టేస్ట్స్ డిఫర్! దానికి నన్నేం చేయమంటావు. పాలమీగడ యిష్టం లేదంటే అది వాళ్ళ ఖర్మ. నాకు మాత్రం చాలా యిష్టం. అందుకే అపూర్వమైన మన స్నేహాన్ని దానితో పోల్చుకుంటాను" అంటూ తన వాదాన్ని సమర్థించుకునేవాడు మురళి.

ఇద్దరూ మౌనంగా లేచి రోడ్డున పడ్డారు. ఇద్దరూ కలసి రోజూ మురళి యింటికి వెళ్ళి ఓ గంట కాలక్షేపంచేసిన తర్వాత జస్వంత్ దగ్గరలోనేవున్న తన రూమ్‌కు వెళ్ళడం మామూలుగా జరుగుతుండేది. చౌరాస్తా రాగానే "వస్తానురా మురళీ!" అంటూ ముందుకు ఎటో వెళ్ళబోతున్న జస్వంత్‌ను చెయ్యి పట్టిలాగి తమ యింటి వైపు తీసుకెళుతూ....

"జస్వంత్! ఈ సస్పెన్స్ ఏమిటో నే భరించలేకుండా వున్నానురా! ఏమిటింత అయోమయావస్థలో వున్నావు? హఠాత్తుగా నీ అలవాట్లన్నీ అమాంతంగా మార్చేసిన అద్భుతశక్తి ఏమిటో నేను తెలుసుకునేంతవరకూ నిన్ను విడిచిపెట్టను!" అని గట్టిగా చేయి పట్టుకొని వదిలిపెడితే తప్పించుకొని వెళ్ళిపోతాడేమోనన్న భయంతో ముందుకు అడుగులేస్తున్న మురళి చెయ్యి పట్టుకొని ఆపి,

"మురళీ యిప్పుడింటికొద్దురా యింటి దగ్గర అమ్మా, చెల్లాయ్ వుంటారు. వాళ్ళముందు నేను నోరు విప్పలేను.... ఎక్కడైనా వెళదాం పద" అంటూ అర్థింపుగా చూశాడు.

"ఓ.కే. యాజ్ యూ విష్. పద." అంటూ వెనక్కు తిరిగాడు మురళి. ఇద్దరూ నెమ్మదిగా నడుస్తూ బిర్లామందిర్

చేరుకున్నారు. వాళ్ళు కడుక్కొని లోపలికి ప్రవేశించారు. మౌనంగా స్వామిదర్శనం చేసుకొని, నుదుట చందనం అంటించుకొని హుస్సేన్ సాగర్‌కు అభిముఖంగా పాలరాతి మెట్ల మీద కూర్చున్నారు.

ప్రశాంతంగా వుంది వాతావరణం. దగ్గరలో ఎక్కడో వర్షం కురిసినట్లుంది. చల్లటి వర్షపుగాలితో పాటు కమ్మటి మట్టివాసన మేళవించి, ఆ ప్రశాంత ప్రకృతి మరింత సుగంధాన్ని పులిమింది. పూజారిచ్చిన కొబ్బరిముక్కలు మురళి చేతిలో పెట్టాడు జస్వంత్. మురళికి కొబ్బరంటే చాలాయిష్టం. అది ప్రసాద మైతే మరింత యిష్టం. అందుకే బిర్లా మందిర్ ఎప్పుడు వెళ్ళినా జస్వంత్ ఒక్క ముక్క నోట్లో వేసుకొని మిగ తాది మురళి కిచ్చేస్తూవుంటాడు. అది ఓ అలవాటుగా మారిపోయింది.

కొబ్బరి అందుకొని నోట్లో వేసుకుంటూ "రక్షించావురా జస్వంత్. ఇవాల్టి అన్ని పొరపాట్లతో పాటు ఈ అలవాటును పొరపాటుగా మర్చిపోతావేమోనని చూస్తున్నాను." అంటూ జస్వంత్‌ను నవ్వించడానికి ప్రయత్నిస్తూ నవ్వుతున్న మురళి నవ్వుతో శ్రుతి కలిపాడు జస్వంత్.

ప్రశాంత ప్రకృతి, పవిత్రమైన దేవాలయ ప్రాంగణం. స్వామి దర్శనం చేసుకున్నతర్వాత మనసుకు అదోరకమైన శాంతి కలిగినట్లైంది. జస్వంత్ ఎదురుగా కనిపిస్తున్న ప్రకృతి రామణీయకతలో లీనమైపోయాడు కొంతసేపు. అంతలోనే ఆ కనులలో సన్నటి నీటిపొర తళుక్కుమన్నది. భావావేశమున్న కవి, జస్వంత్. అప్పుడప్పుడలా మురళి సమక్షంలో కూడా ఒంటరిగా వూహల్లో మునిగి మనసులో ఏదో మధురమైన కవితకు రూపకల్పనచేసుకునే జస్వంత్‌ను ఎప్పుడూ డిస్టర్బ్ చేయడు మురళి. మౌనంగా పరిసరాలను పరికిస్తూ వుండిపోయాడు మురళికూడా.

పదినిముషాలలా మౌనంగా గడిచిపోయాయి. నెమ్మదిగా తల తిప్పి మురళివైపు చూసిన జస్వంత్....

"మురళీ! నేను.... నేను మా వూరు వెళ్ళిపోతున్నానురా, బహుశ మరింక తిరిగిరాను ఎప్పటికీ.... నీతో యీ విషయం చెప్పడానికి మధ్యాహ్నంనుంచీ నేను పడ్డ అవస్థ ఎలాంటిదో నాకు మాత్రమే తెలుసు" అంటున్న జస్వంత్ కళ్ళనుంచి ముత్యాల సరాల్లా తెగిపడ్డాయి కన్నీళ్ళు.

ఆశ్చర్యంగా జస్వంత్ వైపే చూస్తున్న మురళికి జస్వంత్ మాటలతో మతిపోయినట్లే అయింది.

"ఏవిటిరా నువ్వు మాట్లాడేది? వొంటిమీద తెలివుండే మాట్లాడుతున్నావా? మీ వూరెళ్ళిపోవడమేమిటి? తిరిగి రాకపోవడమేమిటి? వుద్యోగం వదిలేసి



వెళ్ళి ఏంచేస్తావు? ఈ సంవత్సరంతో నాన్నగారు రిటైరై పోతారు అయన్ని కూడా తీసుకొస్తా నన్నావు కదరా. మొన్నకూడా ఆ పల్లెటూళ్ళో అయనొక్కరూ నానా అవస్థా పడుతున్నారు. నాన్నగారిని యిక్కడికి తీసుకొచ్చేస్తాను. బ్రహ్మాండమైన కుక్‌ను చూడరా అన్నావు. ఇవాళ సడన్‌గా సంధి సోకి నట్లీ మాటలేవిటిరా జస్వంత్? నాకేం అర్థంకావడంలేదు నీ ధోరణి" అన్నాడు మురళి జస్వంత్ వైపే అయోమయంగా కన్నార్పకుండా చూస్తూ.

"మురళీ! నాన్నగార్ని ఆ వుద్యోగం మానేయమని నాదగ్గరకు వచ్చేయమని ఎప్పుడో చెప్పాను. ఈ వయసులో ఆయన కష్టపడటం నాకెంతమాత్రం యిష్టంలేదు. అయినా ఆయన నా మాటలు వినలేదు. 'వంట్లో శక్తివున్నంతవరకూ శ్రమించడంలో తప్పులేదురా! ఎలాగూ మరో సంవత్సరం పోతే నీ అంకన చేరక తప్పనపుడు యిప్పటినుంచే ఈ ప్రశాంతమైన పల్లెవాతావరణం వదలి, పచ్చటి పంటపొలాల్ని ఎవరికో అప్పజెప్పి రావడం యిష్టంలేదురా' అంటూ నా నోరు మూయించేవారు.

కానీ.... కానీ ఈరోజు జరిగిందేమిటో తెలుసా? ఎవరినైతే తనవాళ్ళు తనకు ఆత్మీయులు, తమ పల్లెవాసులు, అమాయకులు అనుకుంటూ అభిమానంగా వాళ్ళనూ ఆ గ్రామాన్ని వదలలేక వుండిపోయారో, ఆ పల్లె ప్రజలు నాన్నగార్ని ఈ వయసులో, తమ పార్టీ రాజకీయాలలో పాలుపంచుకోలేదనే కక్షతో, ఎవరితో మాట్లాడినా వాళ్ళ తరఫున చాటుగా ప్రచారం చేస్తారేమో అన్న అనుమానాలతో. కక్షతో, ఆదమరచి

ఒంటరిగా, ప్రశాంతంగా వుంటుందని పంటపొలాలకు దగ్గరగా ప్రత్యేకంగా కట్టించుకున్న ఆశ్రమంలో నిద్రపోతుం డగా, యింటికి నిప్పంటించారు".

"జస్వంత్!" అప్రయత్నంగా పెద్దగా అరిచాడు మురళి.

"అవును మురళీ! మంటలు నలువైపులా నాల్కలు చాస్తుండగా చూసిన మాలపల్లి మనుషులు మంటలార్పి నాన్నగారిని బయటకు తీసుకొచ్చారుట. కానీ అప్పటికే అగ్నిజ్వాలలు నాన్నగారి రెండు కళ్ళనూ ఆహుతి చేసుకున్నాయి. ఇది జరిగి వారంరోజులైందట. కానీ నాన్నగారు నాకు తెలియజేసే ప్రయత్న మేదీ చేయలేదు. ఆ దుర్ఘటన జరిగిన అయిదురోజులకు మాలపల్లిలో వుంటున్న మల్లి ఎలాగో నా అడ్రస్ సంపాదించి వుత్తరంవ్రాసి పోస్టుచేసింది. తనే దగ్గరుండి నాన్నగార్కి అమర్చి పెడుతోందట. సద్బ్రాహ్మడై యుండి మాల వాళ్ళను యింట్లోకి రానిచ్చినందుకు నాన్నగారి బ్రాహ్మణ్యం మైలబడి పోయిందనే వంకతో వూళ్ళో పెద్ద మనుష్యులెవరూ నాన్నగారి గురించి పట్టించుకోలేదట. చివరికి వూరే వెలివేసిన మల్లి నాన్నగారిని అంటిపెట్టు కొని వుండి అన్ని సదుపాయాలూ చూస్తోందట. నన్ను వెంటనే బయలు దేరి "పుణ్యపూర్" వచ్చెయ్యమని వ్రాసింది మల్లి. మా వూరి పేరులోనే పుణ్యముంది మురళీ. మనుషుల్లో కరడు గట్టిన కాఠిన్యం, పాపం తప్ప మరేంలేవు. వున్న వూరు వదలిరావడం యిప్పుడు కూడా నాన్నగారికి ఇష్టంలేదని ఈ సంఘటనతో తెలిసిపోతోంది. నాకీ సంఘటన గురించి తెలియజేస్తే తక్షణం వెళ్ళి నేను తనని ఆ వూరునుంచి తీసు కొచ్చేస్తాననే, ఆయన నాకు తెలియజేయ లేదు. ఈ వయసులో ఈ పరిస్థితుల్లో ఆయన అభీష్టాన్ని కాదని యిక్కడికి తీసురావడమూ భావ్యంకాదు.

అందుకే....అందుకే నేనీ నిర్ణయాని కొచ్చాను మురళీ! మా వూరెళ్ళి నాన్న గారి సమక్షంలో, ఆయన కత్యంత ప్రియమైన పల్లెలో, మా నాలుగెకరాల భూమిని సాగుచేసుకొంటే మా యిద్దరికీ జరక్కపోదు!" అంటున్న జస్వంత్ కంఠం బొంగురుపోయింది. అవిరామంగా కురుస్తున్న కన్నీళ్ళను కర్చీఫ్‌తో తుడుచుకుంటూ మురళి వైపు చూశాడు. నిస్సహాయమైన ఆచూపు చూసిన మురళి కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయి.

ఈ 5,6 సంవత్సరాలుగా తమ యిద్దరి స్నేహం. జస్వంత్ తమ యింట్లో మనిషిలా కలిసిపోవడం, చెల్లెలు సౌమ్య కూడా జస్వంత్‌ను "చిన్నన్నయ్యా-" అని ప్రేమగా పిలవడం జస్వంత్ ప్రతి పండుగకూ చెల్లాయికంటూ ఏదో ఓ కానుక తేవడం, అది చూసుకొని సౌమ్య మురిసిపోవడం,తను జస్వంత్‌ను

యువ

మందలించడం, అప్పుడు అన్నా చెల్లెళ్ళి ద్దరూ కలిసి అమ్మ ప్రక్కన చేరడం, తను వొంటరివాడవడం. చిలిపికజ్జాలు, అలకలూ, అనునయలూ. నిజంగా తనకో తమ్ముడిలా, ప్రియస్నేహితుడిగా ప్రాణంలో ప్రాణంగా అనిపించే జస్వంత్‌తో గడిపిన ఒక్కో క్షణం సినిమా రీలులా మురళి కళ్ళముందు కదలాడింది. అదేరకంగా జరిగిపోయిన మధురమైన జ్ఞాపకాలను, మురళి కుటుంబంతో కలిగిన తన సాన్నిహిత్యాన్ని గురించి ఆలోచి స్తున్న జస్వంత్ కళ్ళు మురళి కళ్ళతో కలుసుకోగానే యిద్దరూ అప్రయత్నం గానే దగ్గరికి జరిగి, ఒకరి భుజంపైఒకరు వొరిగి మూగగా కన్నీళ్ళు కార్చారు. భాషకందని భావోద్రేకంతో యిద్దరి మనసులూ మూగవోయాయి.

ఆ పరిస్థితుల్లో జస్వంత్‌ను ఆగమని చెప్పే ధైర్యం లేదు మురళికి. కన్న తండ్రి కళ్ళు రెండూ పోగొట్టుకొని అనాధలా అండలేని ఆ పల్లెలో ఎవరి దయాదాక్షిణ్యాలమీదో ఆధారపడి వుంటే జస్వంత్ తీసుకున్న నిర్ణయాన్ని మార్చ డానికి ప్రయత్నించీ ప్రయోజనం లేదు. అంతకంటే ధైర్యంగా పరిస్థితుల్ని చిరు నవ్వుతో ఎదుర్కొనగల ఆత్మబలాన్ని చేకూర్చడం ఆత్మీయుడిగా, స్నేహితుడిగా తన బాధ్యత, కర్తవ్యం.

ఆలోచనల్లో మునిగివున్న జస్వంత్‌ను నెమ్మదిగా తట్టి చేయూత నిచ్చి పైకి లేపిన మురళి, వీపున చేయి వుంచి రాస్తూ, మౌనంగా జస్వంత్ చెయ్యి పట్టుకొని అడుగులు ముందుకు వేశాడు.

మౌనంగా మురళిని అనుసరించాడు జస్వంత్. ఇద్దరిలో బాధ సుళ్ళు తిరుగు తోంది. జస్వంత్ మధ్య మధ్య బయట పడ్డా మురళి బయటపడలేదు.

ఆ మరునాడు మధ్యాహ్నం 'పుణ్యాపూర్' బయలుదేరిన జస్వంత్‌ను పంపడానికి స్టేషన్‌కు వెళ్ళిన మురళీ, సౌమ్యలకు ఎంత అపుకుందామన్నా కన్నీరాగలేదు. సౌమ్య మరీ వెక్కివెక్కి ఏడుస్తుంటే వోదార్చడానికి ప్రయత్ని స్తున్న జస్వంత్ కళ్ళలో నీళ్ళూరి సౌమ్య ముఖం మసక మసకగా కనిపించింది.

"ఓన్నన్నయ్యా! ఇంక అసలిక్కడికి రానే రావా! మమ్మల్ని చూడటానికైనా రావా?" అంటూ దీనంగా అడుగుతున్న సౌమ్య తలమీద చేయివేసి దగ్గరకు తీలుకుంటూ.

"ఎందుకు రాను సౌమ్యా! మిమ్మల్ని చూడకుండా నేను మాత్రం ఎలా వుండ గలను? పిచ్చిపిల్లా కళ్ళు చూడు ఎలా ఎర్రగా అయిపోయాయో? రాత్రినుంచీ ఏడ్చి ఏడ్చి ముఖమంతా కందిపోయింది. కళ్ళు తుడుచుకో అమ్మా" అంటూ కర్చీఫ్ అందించాడు జస్వంత్.


ఆ కర్చీఫ్ మీద అందంగా

'జస్వంత్' అని కుట్టినవైపు చూస్తూ "సౌమ్యా! ఎంత కష్టపడి కుట్టావీ పేరు. పరీక్షలప్పైమని చదువుకోమని మురళి హెచ్చరిస్తున్నా పంతం పట్టి, అది కుట్టేంతవరకూ నిద్రపోలేదు. బహుశా అది అంత త్వరగా పూర్తిచేయలేక పోతే ఈ అన్నయ్య మరింక యిప్పట్లో కనిపించడని నీ కప్పటికే తెలిసిపోయిందేమో!" అంటున్న జస్వంత్ కంఠం గాద్గదిక మవడంతో ముఖం ప్రక్కకు తిప్పుకున్నాడు, తన కంట నీరూరడం సౌమ్య కళ్ళలో పడితే మరింత గొడవ చేస్తుందని. సౌమ్యా! కళ్ళు తుడుచుకో. చూడు అందరూ మనవైపె లా చూస్తున్నారో. జస్వంత్ ఏమైనా ఫారెన్ పోతున్నాడేమిటి? యింక యిప్పట్లో కనిపించడని బాధపడటానికి. ఎప్పుడు మీ చిన్నన్నయ్యను చూడాలనిపిస్తే అప్పుడు నాకు చెప్పు. నేను స్వయంగా తీసుకెళతాను. వూరికే నువ్వు ఏడ్చి వాడిని మరింత బాధపెట్టకు. రాత్రంతా అమ్మ వూరికే బాధపడుతుంటే చూసి, స్టేషన్‌కు తీసుకొస్తే తనసలే తట్టుకోలేదని అమ్మని తీసుకురాలేదు. వస్తానని గొడవ చేసి వచ్చావు. నిన్నుకూడా యింట్లో వుంచొస్తే గొడవ తీరిపోయేది." అన్నాడు మురళి. బాధా, విసుగూ కలగా పులగంగా ధ్వనించాయి అతని కంఠంలో. పెద్దవాడుగా తన బాధ బయటపెట్టుకోలేకపోతున్నాడు. అందుకే సౌమ్యమీద విసుక్కున్నాడు ఏంచేయాలో తెలీని అయోమయావస్థలో.

కళ్ళెత్తి మురళివైపు చూసిన సౌమ్య నెమ్మదిగా పైటచెంగుతో కళ్ళు తుడుచుకుంది.

కళ్ళు తుడుచుకుంటున్న ఆ సుకుమారమైన చేతులు పట్టుకొని రెండు సంవత్సరాల క్రితం వరకూ తనూ మురళీ రోజూ షికారుకెళ్ళడం జ్ఞాపకం వచ్చింది. సంవత్సరం నుంచీ వోణీలేసుకోడం మొదలెట్టిన సౌమ్య అన్నయ్యలతో షికారు మానేసింది. కానీ జస్వంత్‌ను ఎప్పుడూ పరాయివాడిగా అనుకోలేక పోయింది సౌమ్య. తనకు అత్యంత ప్రియమైన ఈ అన్నయ్య యిలా అర్ధాంతరంగా తమకు దూరంగా వెళ్ళిపోతున్నాడంటే మనసా వాస్తవాన్ని అంగీకరించడానికి రడీగాలేదు. ఈ పరిణామానికి సున్నితమైన సౌమ్య మనసు తట్టుకోలేకపోతోంది.

గార్డ్ విజిల్ వేయడంతో ట్రెయినెక్కిన జస్వంత్ ఆప్యాయంగా చిన్నన్నయ్యా అని పిలిచే సౌమ్యనుంచీ, ఆత్మీయుడిగా అండదండగా వుండే మురళినుంచీ దూరంగా తమ వూరివైపు సాగిపోతున్న ట్రైన్‌లో ద్వారంవద్ద నిలబడి ఆగని కన్నీటితో మసకలు బారుతున్న కళ్ళను తుడుచుకుంటూ, అస్పష్టంగా కనిపిస్తున్న వాళ్ళవైపు చూస్తూ చేయి వూపుతూనే వున్నాడు. వాళ్ళు కనుమరుగైపోయినా




ద్వారాన్ని వదిలి రావాలనిపించడంలేదు. కనిపించినంతమేరా వాళ్ళు చేతు లూపుతూనే వున్నారు. అవాళ్టితో తన కెంతో యిష్టమైన హైద్రాబాద్‌కూ తనకూ ఋణం తీరిపోయింది అనుకో గానే మనసంతా వికలమైంది జస్వంత్‌కు.

సౌమ్య అత్యంత శ్రద్ధగా అప్యా యంగా కుట్టియిచ్చిన కర్చిఫ్‌తో కళ్ళద్దు కుంటూ అప్రయత్నంగానే దాన్ని పెదవుల కంటించుకున్నాడు. దుఃఖం తెరలు తెరలుగా వస్తోంది.

మురళీ, సౌమ్యా, తనూ ఒక తల్లి కడుపున పుట్టకపోయినా ఆ తల్లి అన్న పూర్ణమ్మగారి ఆదరణలో తను వాళ్ళకు పరాయివాడనే భావన ఎప్పుడూ కలుగ లేదు. చిన్నప్పుడే తల్లిప్రేమకు దూర మైన తనకు మాతృప్రేమలోని మాధుర్యాన్ని మమతలో రంగరించి రుచి చూపించింది అన్నపూర్ణమ్మగారు. వాళ్ళను తనెలా మర్చిపోగలడు? అలాంటి వాళ్ళకు దూరంగా వెళ్ళవలసివస్తుందని కానీ, వెళతానని కానీ ఎన్నడూ అనుకో లేదు. అనుకోనివి జరిగినప్పుడే విధి మీద నమ్మకం మరింత పెరుగుతుంటుంది.

నెమ్మదిగా కదిలి వెళ్ళి ఖాళీగా వున్న ఓ చోట కూర్చున్న జస్వంత్‌కు, ఆ చుట్టుప్రక్కలవారితో మాట్లాడాలని పించడంలేదు. ఆలోచనలు పరి పరి విధాల సాగిపోతున్నాయి. దీనంగా అంధత్వాన్ని ఆశ్రయించి, అనాథలా అవస్థలుపడుతున్న తండ్రిని గురించి ఆలోచన రావడంతో ఎప్పుడెప్పుడు

తమ వూరు చేరతానా అనే ఆతృత తోనే గడిపాడు మిగతా సమయమంతా.

జస్వంత్ యింటికిచేరేసరికి ఎదురుగా కనిపించిన దృశ్యంచూసి మనసునీరైంది. ఆరుబయట మంచంమీద కూర్చొని వున్న తండ్రి ప్రక్కనే వున్న చేతికర్ర కోసం తడుముకోడం కనిపించింది. జస్వంత్ ఆ పరిస్థితిలో తండ్రిని చూసి తట్టుకోలేకపోయాడు. సూట్ కేస్, ఎయిర్ బాగ్, ఓ మూలకు విసిరి "నాన్న గారూ!" అంటూ బొంగురుపోతున్న గొంతుతో పిలుస్తూ తండ్రిదగ్గరకు పరు గెట్టాడు. జస్వంత్ స్వరం వింటూనే ఆయన గుండె గొంతులోకి వచ్చింది. "బాబూ జస్వంత్ !" అంటూ ఆనందం, ఆవేదనలు ముప్పిరిగొనగా లేవడానికి ప్రయత్నిస్తున్న ఆయన్ని చుట్టేసి, చిన్న పిల్లాడిలా ఏడుస్తున్న జస్వంత్‌ను వీపు నిమురుతూ వోదార్చ ప్రయత్నిస్తూ....

"వూరుకో బాబూ!నువ్వెప్పుడొచ్చావు! ఎలా వచ్చావు?" అంటూ గాద్గదికంగా ప్రశ్నిస్తున్న వెలుగుకు దూరమైన ఆయన కళ్ళనుంచీ కూడా కన్నీరు కాల్వలు కట్టింది.

జస్వంత్ స్వరం విని గుమ్మంలోకి వచ్చిన మల్లికి ఆ దృశ్యం చూసి కళ్ళు చెమ్మగిల్లాయి. మౌనంగా లోపలికెళ్ళి చెంబుతో నీళ్ళు తీసుకొచ్చి అక్కడ పెట్టి, సూట్ కేసు, బాగ్ అందుకొని లోపలికెళ్ళింది. తిరిగి బయటకు వచ్చి అప్పటికి కొద్దిగా తేరుకొని 'అసలీ ఘోరమెలా జరిగింది?' అని అడుగు తున్న జస్వంత్‌కు వివరంగా జరిగిం దాన్ని గురించి చెప్పింది మల్లి.

* * *

పద్దెనిమిదేళ్ళన్నా నిండకుండానే సర్వం పోగొట్టుకున్న మల్లి, అందరి లాగే పుట్టింది పుణ్యపూర్‌లో. తల్లి దండ్రులకే కాకుండా వూరందరికీ గారాబు పట్టిగా పెరిగింది. ఆస్థిపరులు కాకపోయినా జరుగుబాటుకు లోటులేని రైతుకుటుంబం వాళ్ళది. కానీ దుర దృష్టవశాత్తూ మల్లికి అయిదేళ్ళ వయసులోనే పాముకాటుకు బలై తండ్రి మరణిస్తే, తల్లి దగ్గిర ఏ లోటూ తెలీ కుండానే పెరిగింది. ఈ మాష్టారి దగ్గిరే పాఠాలు నేర్చుకుంది. జస్వంత్ చేత అప్పుడప్పుడూ మొట్టికాయలు తినేది పద్యాలు సరిగ్గా అప్పజెప్పకపోతే. ఆ వెంటనే మాష్టారికి కంప్లెయింట్ చేస్తే ఎదురు జస్వంత్‌కు వార్నింగిచ్చే వారు మాష్టారు. అంతటితో తృప్తిపడి కిలాకిలా నవ్వుతూ వెళ్ళిపోయేది.

అంత అమాయకంగా అందంగా అపరంజిబొమ్మలా పెరిగిన మల్లి మాటలతో మోసంచేసి, నిన్ను పట్నం తీసుకెళ్ళి చక్కటి వీణ పాఠాలు నేర్పి స్తానని చెప్పి, నేర్పుగా నమ్మించిన ప్రక్కవూరు మున్సబు కొడుకు మాటలు నమ్మింది. ప్రతి ఆదివారం ఏవేవో

వింత కానుకలతో ఏటివొడ్డున కలుసు కొని మురిపించే అతని మాటలన్నీ అక్షర సత్యాలనుకుంది. ఏది చెప్పినా తన మంచికే ననుకుంది. పట్నం తీసు కెళ్ళి నిన్ను పెళ్ళి చేసుకుంటాను. మహా రాణిని చేస్తాను. అక్కడి పెద్దోళ్ళంతా నా స్నేహితులేనంటే వెర్రిగా నమ్మి కన్నతల్లికైనా చెప్పకుండా ఓ శుభ ముహూర్తాన అతని వెంట వెళ్ళి పోయింది. అతను మోసంచేశాడు. పెళ్ళి చేసుకోలేదు. ఓ సంవత్సరం ఏదేదో చెప్పి మభ్యపెడుతూ ఓ యింట్లో వుంచాడు. చివరికి అతను చేసిన ద్రోహం అతన్నే బలి తీసుకుంది. ఓ కారు యాక్సిడెంట్‌లో మరణించడంతో దిక్కులేనిదై పోయిన మల్లి మరి గత్యం తరం లేక వెళ్ళిన సంవత్సరానికి, కన్న తల్లి కడుపులో పెట్టుకోక పోతుందా అన్న ఆశతో తిరిగి తమ వూరికి వచ్చే సింది. కానీ కడుపులో పెట్టుకోడానికి కన్నతల్లి మిగలలేదు. కూతురు చేసిన పనికి నలుగురిలో తలెత్తుకోలేక మల్లి వెళ్ళిన మరునాడే వురి పెట్టుకుందా మాతృమూర్తి. అన్నీ పోగొట్టుకొని, అనాధలా మిగిలిన మల్లి నెవరూ ఆద రించలేదు. సానుభూతిగా మాట్లాడ బోయిన మాష్టారిని కసిరికొట్టారా విష యంలో. మాలపల్లిలో వుండమని నిర్దా క్షిణ్యంగా వూళ్ళోని పెద్దమనుషులనబడే వాళ్ళు తీర్పిచ్చారు. మళ్ళీ మరో వూరు వొంటరిగా వెళ్ళి బ్రతికే ధైర్యంలేక వాళ్ళ మాట ప్రకారం మాలపల్లినే ఆశ్రయించి వాళ్ళలో ఒకతిగా కలిసి పోయింది. వాళ్ళతోపాటు పని పాటలు చేసుకుంటూ నిర్లిప్తంగా జీవితాన్ని గడి పేస్తోంది.

అప్పుడప్పుడూ మాష్టారు చెప్పే ధైర్య వచనాలు మల్లికి మనశ్శాంతి నిచ్చేవి. ఆ వూళ్ళో ఆదరంగా పలక రించేది ఒక్క మాష్టారే. అలాంటి ఆయనకు ప్రమాదం జరిగిందని వినగానే ఒక్కక్షణం కూడా నిలవకుండా తన తండ్రికే ఏదో ఆపద వచ్చినట్లు తల్ల డిల్లిపోయి పరుగు పరుగున అక్కడికి చేరుకుంది. అప్పటినుంచీ ఆయన్ని ఓ చిన్నపిల్లాడిలా, కన్నతల్లిలా సాకుతూ, ఆయనకే అవసరం వచ్చినా క్షణాల మీద అమర్చిపెడుతోంది.


జస్వంత్‌కు వ్రాస్తానంటే వొప్పు కోని ఆయన మొండితనమేమిటో అర్థంకాలేదు. కానీ మల్లికి మనసాగ లేదు. సమర్థుడైన కొడుకుండీ ఆయన అవస్థలు పడాల్సిన అవసరం కనిపించ లేదు. పుస్తకాల బీరువాలో దొరికిన జస్వంత్ అడ్రసు పట్టుకొని లెటర్ వ్రాసేసింది ధైర్యంగా. కానీ మాష్టారికి తెలిస్తే ఏమంటారోనని భయంగానే వుంది మనసులో జస్వంత్‌ను తలవంచు కొని "కాళ్ళు కడుక్కోండని" నీళ్ళ చెంబు అందిస్తున్న మల్లి నుద్దేశించి....

"మల్లీ! యిలారా!" అంటూ పిలిచారు మాష్టారు. ఆయనింకేమీ అనక ముందే జస్వంత్ చేతిలో చెంబు వుంచేసి మాష్టారి పాదాల దగ్గిర కూర్చుంటూ "క్షమించండి మాష్టారూ! మీరు వద్దన్నా ఆయనకు తెలియజేయడం నా ధర్మమని పించి వ్రాశాను. తప్పని మీ కనిపిస్తే మీరు వేసే శిక్షకు సిద్ధంగా వున్నాను" అంటూ తల వంచుకుంటూన్న మల్లిని చూసి జస్వంత్ ముందుకొస్తూ "మల్లీ! నువ్వెందుకలా బాధపడతావు. నాన్నగారు నన్ను మర్చిపోయి, అంత బాధలోనూ హాయిగా వుండగలిగారంటే కారణం నువ్వే.... నువ్వే లేకపోతే..." అంటున్న జస్వంత్ కంఠం వణకడం గమనించి తలెత్తి చూసిన మల్లి మనసు కరిగిపోయింది అతని బాధ చూసి.

* * *

ఆ రాత్రే తను ఉద్యోగం వదిలేసి వచ్చినట్లు యింక అక్కడే వుండదలచినట్లు చెప్పాడు జస్వంత్ తండ్రితో. ఓ రకంగా ఆ వార్త మాష్టారికి పన్నీటి జల్లులా సోకింది. కానీ జస్వంత్ బంగారు భవిష్యత్‌కు తను బంధమవుతున్నానేమోననే బాధ ఓ ప్రక్కన వేధించింది. హాయిగా, సరదాగా పట్నంలో స్నేహితులమధ్య గడపాల్సిన జీవితాన్ని ఈ కక్షల మధ్య, కార్పణ్యాల మధ్య, కుటిల రాజకీయాల మధ్య కీడ్వడం మంచిదికాదేమో ననిపించిందోక్షణం. అయినా యిప్పుడేమనుకొని ఏం లాభం. జస్వంత్ ఓసారి ఓ నిశ్చయానికి వస్తే దాన్ని మార్చడం, అతని మనసు మార్చడం, అసాధ్యమని తెలుసు. ఒకసారి ఓ నిశ్చయానికి వచ్చాడంటే దానికి బ్రహ్మరుద్రాదులు అడ్డువచ్చినా ఆ నిశ్చయం సడలించుకోడు. అంతటి మొండిపట్టుదల అతనిది. ఈ అవసాన దశలో ఈ పల్లెను, ఈ భూమాతను వదలి దూరంగా వెళ్ళటం తనకీ యిష్టం లేదు. అది అర్థంచేసుకొనే జస్వంత్ ఈ నిర్ణయానికి వచ్చివుంటాడు. అని తృప్తిగా నిట్టూర్చారు మాష్టారు. జస్వంత్‌ను పిలిచి వాగ్దానంతీసుకున్నారు, ఎట్టి పరిస్థితులలోనూ జరిగిన సంఘటన గురించి ఎవ్వరితోను పంతాలకు పట్టింపులకు పోనని. ఆ ఘోరం తలపెట్టిన రాక్షసులెవరైందీ తెలుసుకున్నా వాళ్ళ జోలికి పోనని మాటివ్వక తప్పలేదు జస్వంత్‌కు.

రోజులు ఓ రకంగా సాఫీగానే సాగుతున్నాయి. మల్లి మామూలుగా మాష్టారికీ జస్వంత్‌కూ వండిపెట్టి తన యింటికి, వెళ్ళిపోయేది. జస్వంత్ రాక ముందు మాష్టారికి తోడుగా అక్కడే పడుకుంటుండేది. అసలే అనుమానాలకు ఆలవాలమైన ఆ పల్లెవాసులు జస్వంత్ యింట్లో తనూ వుంటే అపనిందలు అవలీలగా వేయగలరని తెలిసి, సాధ్యమైనంతగా జస్వంత్‌ను తప్పుకు తిరుగు




తోంది మల్లి. అదీకాక అతనికి తన ముఖం చూపించాలంటే ఏదో బాధగా వుండేది. తన కథ జస్వంత్‌కు కూడా తెలిసిపోయుంటుందనటంలో సందేహం లేదు. చిన్నప్పుడు అల్లరిగా గంతు లేస్తూ ఆడిన చెలికాడు జస్వంత్, అతని ముందు తను తలవంచుకునే పరిస్థితుల్లో నిలబడవలసి వచ్చినందుకు మనసులో మధనపడని క్షణంలేదు. మల్లి తప్పు కొని తిరగటం, మునపటిలా చనువుగా మాట్లాడకపోవడం ఈ పరిస్థితి బాధగా వుంది జస్వంత్‌కు. మల్లిని గురించి అంతా తెలిసింది. పాపం! మల్లి తమకు రోజూ వచ్చి ఎందుకు వండిపెట్టాలి? తమకూ ఆమెకూ ఏమిటి సంబంధం? ఏదో చిన్నప్పుడు పాఠాలు చెప్పిన మాష్టారైనంత మాత్రాన తన తండ్రికి అంత ప్రేమగా అన్ని సపర్యలూ చేయవలసిన బాధ్యత ఆ అమ్మాయికి వుండవలసిన అవసర మేముంది? పైగా తమకు వండిపెట్టి తమ యింటి కెళ్ళిపోయి తనకు వండుకొని తింటుంది. తమతోపాటు భోజనంకూడా చేయడంలేదు. తాము డబ్బిచ్చి పెట్టు కున్న వంటమనిషి కాదు. మరలాంటప్పుడు ఆ అమ్మాయితో చాకిరీ చేయించుకోడం ఏం న్యాయం?

ఓ నిశ్చయానికి వచ్చిన జస్వంత్ చేటలో బియ్యం పోస్తున్న మల్లి దగ్గరకు వచ్చి....

"మల్లీ! మరో గిద్దెడు బియ్యంపొయ్యి చేటలో" అన్నాడు, ముత్యాల్లాంటి పలువరస తళుకుమనేలా చిన్నగా నవ్వుతూ.

"ఏం యివ్వాళ అంత ఆకలిగా వుందా?" అంది మొట్టమొదటిసారిగా జస్వంత్ వైపుకళ్ళెత్తిచూస్తూ. అరుదుగా నవ్వే మల్లి నవ్వులో ఓ ప్రత్యేక ఆకర్షణ వుంది. అందమైన ఆ అమ్మాయి ముఖానికి భగవంతుడు ప్రసాదించిన అపూర్వమైన కళ్ళు, నవ్వితే సొట్టలు పడే బుగ్గలు, తళుకులీనే పళ్ళు, గులాబీ రేకుల లేతదనాన్ని నింపుకున్న అంద మైన పెదాలు. అతి సాధారణమైన బట్టల్లోకూడా అత్యంత ఆకర్షణీయంగా కనిపించే మల్లిని, ఆ అపూర్వ సౌందర్యాన్ని ఓ క్షణం సర్వం మరచి రెప్పవేయకుండా చూస్తున్నాడు జస్వంత్.

మల్లిని వూరునుంచి వెలివేయడంలో పెద్దలు చాలామంది పెద్ద ప్లానుతోనే చేశారాపని. వూరికి దూరంగా పాకవేసి యిస్తాం వుండమన్నారు, మాలపల్లిలో వుండటానికి ఎలాగూ యిష్టపడదని. ఒక్క సంవత్సరం పట్నంలో వుండటంతో ప్రపంచానుభవంలో చాలా భాగం గడించగలిగిన మల్లి వూరికి దూరంగా ఆ తోడేళ్ళకు ఎదురుగా వుండటంకంటే మాలపల్లిలో మనుష్యుల మధ్య వుండటమే మేలని నిర్ణయించు కుంది. అది వాళ్ళకు నిరాశనుకలిగించినా ఎప్పటికప్పుడు అవకాశంకోసం ఎదురు చూస్తూనేవున్నారు.

* * *

నవ్వుతున్న మల్లి వైపునుంచి కళ్ళు తిప్పుకోలేక అలాగే చూస్తున్న జస్వంత్ చూపులకు తడబడింది మల్లి. గబగబా వాకిట్లోకి వెళ్ళి చేట చేతుల్లోకి తీసుకుంది బెడ్డలు ఏరాలని.

అప్పటికీలోకంలోకి వచ్చిన జస్వంత్ తనను తాను తిట్టుకుంటూ వాకిట్లోకి వచ్చి "మల్లీ ఈవేళనుంచీ నువ్విక్కడే భోంచేయాలి. అలా అయితే వంటచేయి, లేదంటే అలాగే వదిలేసి మీ యింటికి వెళ్ళిపో." అని వచ్చినంత వేగంగా లోపలికెళ్ళిపోయాడు, మల్లి సమాధా నానికికూడా ఎదురుచూడకుండానే. కళ్ళప్పగించి అతను వెళ్ళినవైపే చూస్తుండిపోయిన మల్లి చిన్నప్పటిలాగే అతను ఆజ్ఞాపించిన తీరు తలచుకొని చిన్నగా నవ్వుకుంటూ లేచి వంట మొదలెట్టింది.

మాష్టారుకూడా మరీ బలవంతం చేయడంతో మల్లి వాళ్ళతోపాటే అక్కడే భోంచేయక తప్పలేదు. ఎక్కువ టైము మాష్టారింట్లోనే గడిచి పోతోందిప్పుడు. ప్రొద్దున యిల్లు వదలి వస్తే మళ్ళీ రాత్రికే తన గూడు చేరు కునేది. మధ్యాహ్నం సమయాలలో జస్వంత్ దగ్గరున్న పుస్తకాలు చదువుతూ కాలక్షేపం చేసేది. రాత్రి భోజనాలయ్యేటప్పటికి ప్రొద్దుపోతే, మాష్టారు జస్వంత్‌ను తోడువెళ్ళి దిగబెట్టిరమ్మనేవారు మల్లి యింటివరకు.

వాళ్ళ ముగ్గురికీ ఈ పద్ధతి హాయిగానే వున్నా ఆ వూరి మునసబుకు, కరణానికి, పెద్దకాపుకు, మరికొందరు పెద్దలకూ మల్లి అలా మాష్టారి ఫామిలీలో మెంబర్లా కలసిపోయి మళ్ళీ వూళ్ళోకి రాకపోకలు సాగించడం నచ్చలేదు. కన్నుల పండువుగా కనిపిస్తున్న మల్లి సౌందర్యం జస్వంత్ వెంట వెళ్ళుతూ వుంటే వాళ్ళకు కంటగింపుగా వుంది. ఒకటి రెండుసార్లు జస్వంత్‌ను హెచ్చ రించాలని చూసి సమాధానం తీవ్రంగా రావడంతో నోళ్ళుమూసుకోక తప్పలేదు. కానీ మల్లిమీద కక్షసాధించే అవకాశం కోసం ఆ తోడేళ్ళు ఎదురుచూస్తూనే వున్నారు. అందగాడూ, యువకుడూ అయిన జస్వంత్‌ను పట్టింది. మళ్ళీ వూరికేం అనర్థం తెచ్చిపెడుతుందోనని పుకార్లు లేవదీసారు. మాష్టారు ఎంత చెప్పినా వాళ్ళు వినకపోయేసరికి జస్వంత్ కాలిపోయిన తమ ఆశ్రమాన్ని బాగు చేయించి తమ మకాం అక్కడికే మార్చేశాడు తండ్రి అనుమతితో. జస్వంత్, మాష్టారు, ఆ దిక్కుమాలిన మల్లికోసం వూరువదలి, వూళ్ళోవున్న బంగారంలాంటి యింటిని వదలి, పొలాల దగ్గరున్న ఆశ్రమాన్ని ఆశ్రయించడం తాము వేసిన ఆ పథకంకూడా పారక పోవడం వాళ్ళను మరింత పిచ్చివాళ్ళను చేసింది. "వంటమనిషిని కుదిర్చిపెడతాం ఆ మల్లిని మీ యింటికి రానియ్యకండి మాష్టారూ?" అంటున్న మునసబుకు మెత్తగా సమాధానమిచ్చారు మాష్టారు. "ఎవ్వరూ పట్టించుకోని సమయంలో ఆ దిక్కుమాలిన మల్లే నాకు దిక్కైంది. నాకు దిక్కు దొరకగానే దానిని మా యింటికి రావద్దని చెప్పడం నా వల్లకాదు. అది నేను బ్రతికుండగా చేయలేను. నా చేత ఎవరూ చేయించలేరాపని" అని నిక్కచ్చిగా చెబుతున్న మాష్టారివైపు కొరకొరా చూస్తూ వెళ్ళిపోయాడు మునసబు. "కళ్ళుపోయినా కావరం తగ్గలేదురా ముసలోడా, చూస్తాను. మమ్మల్ని కాదని మీరు ఎలా వుంటారో చూస్తాను. మీ బ్రతుకులు నడిబజార్లోకి ఈడ్వకపోతే నేను మునసబుని కాదు అని మీసం మెలివేసుకుంటూ తనలోతానే శపథం చేసుకున్నాడు. జస్వంత్ అంత కంటె కొరకరాని కొయ్యగా తయా రయ్యాడు. ముసిలాడు ఒక్కడైతే ఓ ఆట ఆడించే పని అని పథకాలు ఆలోచించసాగాడు కరణం మునసబుతో కలిసి.

ఈ లోపుగా సౌమ్య, మురళీల నుంచి వుత్తరాలందుకోడం, వాళ్ళకు జవాబులు వ్రాయడంకూడా జరిగి పోతూనే వుంది. సౌమ్యకు సంబంధాలు వస్తున్నట్లుగా మురళి వ్రాసిన వుత్తరం చూసి 'ముక్కుపచ్చలారని సౌమ్యకు అప్పుడే పెళ్ళా?' అనుకున్నాడు జస్వంత్. అంతలోనే మల్లి రూపం

మనసులో మెదిలింది. "మహా అయితే సౌమ్యకంటే మరో రెండేళ్ళు, ఏడాది పెద్దదేమో మల్లి, కానీ ఆ అమాయకు రాలికి అన్ని ముచ్చట్లూ తీరిపోయాయి.

తెల్లగా మెరిసే ఆపాలభాగాన ఎఱ్ఱటి తిలకం ఎంతటి అందాన్నిచ్చేది మల్లికి. ఆ కుంకుమే వుంటే మరింకెంత కళగా వుండేదో. తీసుకుపోయినవాడు మోసం చేసినా, పెళ్ళంటూ చేసుకోకపోయినా, అతన్నే నమ్మి వున్న నేరానికి, అతను పోవడంతో పసుపు కుంకుమల్ని దూరం చేసుకుంది. అసలీ ఆచారాలేమిటో అర్థం లేనివనిపిస్తాయి జస్వంత్‌కు! ముచ్చటగా చిన్నప్పటినుంచీ పెట్టుకొనే బొట్టూ, కాటుకా, పూలూ మధ్యలో వచ్చిన భర్త పరమెలా అవుతాయో అనుకున్నప్పుడల్లా ఈ అర్థంలేని కట్టుబాట్లమీద అసహ్యం కలుగుతుంది. కానీ అది తన ఒక్కడివల్లా మారేదికాదు. అందమైన మల్లి మరింత అందంగా వాల్జడ వేసుకొని, పూలు పెట్టుకొని, ఎఱ్ఱటి కుంకుమ నుదుట దిద్దుకొని చారడేసి కళ్ళకు మరింత శోభనిచ్చే కాటుక పెట్టుకొని కళకళలాడుతూ కనిపిస్తే ఎంత బావుంటుంది?"

ఈ మధ్య ఎందుకిలా మనసంతా మల్లి నిండిపోతోంది. అంత అమాయకంగా కనిపించే మల్లి ఎవరినో నమ్మి వూరువదలి వెళ్ళి ఓ సంవత్సరం అతనితో గడిపి అతను చనిపోతే తిరిగి వచ్చిందంటే ఆ కథను మనసంగీకరించడంలేదు. అదంతా ఓ కట్టు కథ అనిపిస్తోంది.

మంచెమీద కూర్చొని మల్లి గురించి ఆలోచనల్లో మునిగిపోయిన జస్వంత్ సూర్యుడు పశ్చిమాద్రికి కృంగటం గమనించనేలేదు. మంచె దిగి చేలో వంకాయలు కాసిని కోసుకొని ఆశ్రమం వైపు అడుగులేశాడు.

అప్పటికే హడావుడిగా వంట పూర్తి చేయాలని ఎంతకీ అంటుకోని పుల్లల మీద విసుక్కుంటూ గట్టిగా పొయ్యి వూదుతోంది మల్లి. కాళ్ళ దగ్గర జీరాడుతున్న పైటచెంగుకు నిప్పంటుకోడం గమనించలేదు. ఏకాగ్రతతో పొయ్యి మండించే ప్రయత్నంలో వుంది. కళ్ళలో బూడిద పడటంతో కళ్ళు గట్టిగా మూసుకొని చేతులతో నలుపుకుంటోంది. పైటచెంగుకు నిప్పంటుకోడం అంత దూరంనుంచే చూసిన జస్వంత్ ఒక్క ఉదుటున మల్లి దగ్గరకు పరుగుతీసి పైటచెంగు చేతుల్లోకి తీసుకొని గబగబా నలిపివేశాడు.

అంత హఠాత్తుగా వచ్చి తన పైట లాగేసిన జస్వంత్ వైపు గుడ్లప్పగించి చూస్తుండిపోయింది మల్లి. మంటను నలపడంలో బొబ్బలెక్కిన వేళ్ళను చూసుకొంటూ, "కాస్త చూసుకోవద్దూ పొయ్యిదగ్గర అంత పరధ్యానమైతే ఎలా? నేను రావడం కొంచమాలస్య

మైతే ఎంత ప్రమాదం జరిగేది!" అంటున్న జస్వంత్ వైపు రెప్ప వాల్చకుండా చూస్తున్న మల్లి కళ్ళనిండుగా నీళ్ళు నిండటం చూసి "సరే యివాళ్టికి వండింది చాలు. నువ్వివతలకు రా!" అంటూ పవిట తీసి మల్లి భుజాలనిండుగా కప్పాడు నవ్వుతూ. ఆప్యాయతతో కూడిన అతని మందలింపులో ధ్వనించిన దగ్గరతనానికి మల్లి మనసు కరిగి నీరైంది. పాషాణమైపోయిందనుకున్న హృదయంలో కదలిక ఏదో తెలీని స్పందన ప్రారంభమైంది.

కాలి, బొబ్బలెక్కిన జస్వంత్ చేతులవైపు వో క్షణం చూసి లోపలికి పరుగెత్తి కొబ్బరినూనె తీసుకొచ్చింది. మల్లినే గమనిస్తున్న జస్వంత్ చిన్నగా నవ్వుతూ చేతులు చాపాడు. రెండు చేతుల వేళ్ళూ కాలాయి. గబగబా చేతిలోకి నూనె వంచుకొని జస్వంత్ చేతులమీద నిస్సంకోచంగా, మృదువుగా రాస్తోంది. మంత్రముగ్ధలా, మాటలు రానట్లుగా అలా అయోమయావస్థలో వున్న మల్లి మరింత అందంగా కనిపిస్తోంది జస్వంత్ కళ్ళకు. బరువుగా వాలి తన అరచేతులవైపు దీక్షగా చూస్తున్న ఆ అందమైన కనురెప్పల మీద ఓసారి ముద్దుపెట్టుకోవాలనే గాఢమైన వాంఛను అతి బలవంతంగా ఆపుకున్నాడు.

రాయడం అయిపోయినా జస్వంత్ చేతుల్లోనుంచి మల్లి తన చేతులు తీసివేయలేదు. అవ్యక్తమైన, ముందెన్నడూ కలగని ఏదో అపూర్వమైన అనుభూతితో అలా చేతులు రాస్తూనే వుండిపోయింది. ఇంతకు ముందెన్నడూ కలగని ఓ అతి మధురమైన భావన జస్వంత్ అంతరంగంలో చోటుచేసుకుంది.

"అమ్మాయ్ మల్లీ!" అన్న మాష్టారి పిలుపుతో ఈ లోకంలోకి వచ్చిన మల్లి జస్వంత్ చేతులను వదిలేసింది సిగ్గుగా. జరిగిన ప్రమాదం గురించి విన్న మాష్టారు, "ఎంత ప్రమాదం తప్పిపోయింది. చల్లగాలికి పడుకుంటే అలాగే కునుకు పట్టింది బాబూ! నువ్వు సమయానికి రాకపోతే గుడ్డివాడిని నేను మేల్కొని వున్నా ఏం ప్రయోజనం?" అంటూ మల్లిని దగ్గిరకు పిలిచి తడుముతూ బాధపడుతున్న మాష్టారితో "మరేం ఫర్వాలేదు నాన్నా! మల్లికేం కాలేదు." నాకే అన్నట్లు సైగ చేసి చేతులు చూపించాడు చిన్నగా నవ్వుతూ. అది గమనించిన మల్లి వస్తున్న నవ్వుని ఆపుకో ప్రయత్నిస్తూ మాష్టారి ప్రక్కనే వుండిపోయింది. "వెళ్ళరా యీ పూటకి ఆ వంటపనేదో నువ్వు చూడు, మల్లి దగ్గరుండి చూపిస్తుంది. పిచ్చిపిల్ల బాగా భయపడినట్లుంది." అంటున్న మాష్టారి మాటలకు నవ్వునాపుకోలేక నోటికి గుడ్డ అడ్డం పెట్టుకుంటున్న మల్లి నెత్తిన మెల్లగా


మొట్టి "అలాగే నాన్నా నేనే చూస్తాన్లే, పదమల్లీ" అంటూ ముందుకుదారితీశాడు.

పీటమీదకూర్చోబోతున్న జస్వంత్‌ను వారించి ప్రక్కన మరో పీట వేసి కూర్చోమని అన్నం వార్చి కూర వొయ్యి మీద వేసింది. మౌనంగా మల్లి ప్రతి కదలికనూ చూస్తూ కూర్చున్నాడు జస్వంత్ ప్రక్కన వేసిన పీటమీద బుద్ధిగా. వంట కాగానే మాష్టారికి అన్నం కలిపిపెట్టి జస్వంత్‌ను భోజనానికి పిలిచింది మల్లి.

అన్నంలో చెయ్యిపెట్టి నవ్వుతూ గుత్తివంకాయకూర చేతిలోకి తీసుకున్న జస్వంత్ చెయ్యి చుర్రుమనడంతో నోటిదగ్గర పెట్టుకొని వూదుకుంటూ నిస్సహాయంగా మల్లివైపు చూశాడు. జస్వంత్ చేయి తన చేతిలోకి తీసుకొని మరోమారు చూసిన మల్లి బొబ్బలెక్కిన చెయ్యి చూసి, మరో మాట లేకుండా ఓ ఖాళీ గిన్నె తీసుకొచ్చి, నీళ్ళుపోసి ఆ చేతిని నెమ్మదిగా కడిగి తన పవిట చెంగుతో తడి అద్దింది. మౌనంగా మల్లినే అనురాగం నింపుకున్న కళ్ళతో ఆపేక్షగా, ఆర్తిగాపరికిస్తున్న జస్వంత్‌కు అన్నం కలిపి ముద్ద నోటికందిస్తున్న మల్లి, ఎవరో పరాయిదానిలా వూరందరూ వెలివేసిన మనిషిలా కనిపించలేదు. ఆ క్షణంలో తనకు చిన్నతనంలో ముద్దలు తినిపించిన తల్లిలా కనిపించింది. అప్యాయంగా చెయ్యి కడిగి అద్దుతున్నప్పుడు జన్మజన్మల ప్రియబాంధవిలా అనిపించింది. అలాగే ఆరాధనగా చూస్తూ ముద్దలందిస్తున్న మల్లిలో, మమత వెల్లువై పొంగి కళ్ళు నీటితో నిండి జస్వంత్ రూపం మసక మసకగా కనిపించడంతో గట్టిగా కళ్ళు తుడుచుకొని నవ్వుతూ మరో ముద్ద జస్వంత్ నోటికందించింది. నీళ్ళు నిండినా నవ్వుతున్నట్లున్న మల్లి కళ్ళు కడిగిన ముత్యాల్లా అతిప్రియంగా అన్పించాయి జస్వంత్‌కు.

భోజనాలు ముగిసేటప్పటికి తొమ్మిదైంది. అన్నీ సర్దేసి బయలుదేరిన మల్లిని యింటివరకూ సాగనంపడానికి బయలుదేరాడు జస్వంత్. పొలాల మీదుగా మాలపల్లెవైపు సాగిపోతున్నారిద్దరూ. మౌనం యిద్దరికీ భరించరానిదిగా వుంది. కానీ ఎవరూ నోరు కదపలేదు. మనసంతా ఏదో తెలీని మత్తులో నిండిపోయి ఓ విచిత్రమైన అనుభూతిలో తేలిపోతున్నట్లుంది జస్వంత్‌కు.

దాదాపు మల్లి పరిస్థితీ అలాగే వుంది. "జీవితంలో మొట్టమొదటిసారిగా జస్వంత్ తనకింతదగ్గరెలా అన్పిస్తున్నాడో అర్థంకావడ-లేదు. గణేష్‌తో సంవత్సరం పాటు కలసివున్నా కలుగని భావం, ఓ విచిత్రమైన స్పందన యితనిపట్ల ఎందుకు కలుగుతోంది. అసలు ప్రేమంటే యిదేనేమో. తనకూ



గణేష్‌కూ మధ్య ఒట్టి ఆకర్షణ తప్ప మరేమీ లేదేమో! ఇతనిపట్ల కలుగుతున్న ఈ అవ్యాజానురాగానికి అర్థమేమిటి? ఇది మళ్ళీ వూళ్ళో ఏ అనర్థానికి దారితీస్తుందో!" అంతే ఆ ఆలోచన రావడంతో మల్లి ఒక్కసారి భయంతో కంపించింది. మల్లినే గమనిస్తున్న జస్వంత్ పున్నమి వెన్నెలలో చల్లటి గాలిలో ముచ్చెమటలు పోస్తున్న మల్లి వైపు విచిత్రంగా చూసి, అప్పటికే తూలి పడబోతున్న మల్లిని రెండు చేతుల్తో పట్టుకొని "మల్లీ ఏమైంది నీకు? ఏమిటిలా వణికిపోతున్నావ్?" అంటూండగానే అచేతనంగా జస్వంత్ చేతుల్లో వాలిపోయింది. అలాగే చేతుల మీదకు తీసుకొని ప్రక్కనే వున్న గట్టు మీద పడుకోబెట్టి తల ఒళ్ళోకి తీసుకొని

"మల్లీ! మల్లీ! ఏమైంది ఎందుకిలా అయిపోయావు" అంటూ కుదుపుతూండగానే....

"ఇంట్లో పెట్టుకుంది చాలలేదురా? పల్లీగ్గా పరాచికాలాడుకుంటున్నారా యెన్నిట్లో?" అంటూ వెనకనించి వినిపించిన స్వరం విని తల తిప్పిన జస్వంత్ తలమీద బలంగా పడింది కర్ర దెబ్బ కానీ కర్ర జారిపోవడంతో తల బద్దలయ్యే ప్రమాదం తప్పినా కొద్దిగా చిట్లిన నుదుటిపైనుంచి రక్తం ధార కట్టింది. కళ్ళు బైర్లు కమ్మాయి ఒక్కక్షణం జస్వంత్‌కు. కళ్ళు తెరిచేటప్పటికి చుట్టూ గుంపులుగా పోగయ్యారు జనం. హడావుడికి వులిక్కిపడి లేచికూర్చుంది మల్లి. మున్సబు ముందు కొచ్చాడు. ఎప్పుడూ ఒకరంటే ఒకరికి పడని గ్రామపెద్దలు ముగ్గురూ ఈ విషయంలో ఒక్కటయ్యారు. అయో


మయంగా ఏమీ అర్థంగాక వాళ్ళనేచూస్తు న్నాడు జస్వంత్. వాళ్ళంతా అక్కడికి ఎలా వచ్చారో అర్థంకావటంలేదు. "అందరూ చూశారుగందా పల్లిగ్గా యవ్వారం అందరి కళ్ళలో పడింది. వీళ్ళకు ఏం శిచ్చయిస్తే బాగుంటుందో నిర్ణయించాల!" అంటూ తాపీగా చుట్ట వెలిగిస్తున్న మున్సబు ప్రక్కన చేరిన కరణం మల్లిని వెకిలిగాచూస్తూ నవ్వడం చూసిన మల్లికి అప్పటికి అర్థమైంది. రోజూ వాళ్ళు తమని గమనిస్తూనేవున్నా రనీ, ఈ అవకాశంకోసమే కాచుకూర్చున్నారనీ. అప్పటికే న్యూస్ వూళ్ళోకి అందించారు. కొందరిని మాష్టార్ని తీసుకురమ్మని పంపారు. రక్తం కారుతున్న జస్వంత్ తలవైపు చూడగానే మల్లి కళ్ళు కాలువలు కట్టాయి. జస్వంత్ ప్రక్కనే బిక్కుబిక్కుమంటూ లేచినిలబడింది.

"ఏమంటారు కరణంగారూ!" అంటూ మరోసారి హెచ్చరిస్తూన్న మున్సబువైపు ఛీత్కారంగాచూస్తూఅంద రినీ ఉద్దేశించి....

"మాకు శిక్షవేయటానికి మీరెవ రసలు? మేం తప్పు చేశామనుకుంటే మాకు శిక్ష మేమే వేసుకోగలం. మీ అందరి నోళ్ళూ మూతబడాలంటే.... అంటూ తన నుదుటిమీద కారుతున్న రక్తాన్నితీసి మల్లి నుదుట సింధూరం అద్ది "మమ్మల్ని ఆశీర్వదించండినాన్నా" అంటూ మల్లి చేయిపట్టుకొని తండ్రి పాదాలమీదకు వొరిగిన జస్వంత్‌ను మల్లినీ రెండు చేతులతో పైకిలేపి, దగ్గరకు తీసుకుంటూన్న మాష్టారి కళ్ళవెంట తెలీకుండానే నీళ్ళు కారిపోయాయి. ఏదో అవమానిద్దాం, అవహేళన చేద్దామని వచ్చిన అందరినోళ్ళూ మూతబడ్డాయి. ఓ చేత తండ్రినీ, మరోచేత మల్లినీ నడిపించుకొని వెళుతున్న జస్వంత్‌వైపు మౌనంగా, ఈర్ష్యగా చూడటంకంటే మరేం చేయలేక పోయారు.

మరో వారానికి పచ్చటి పందిట్లో వూరందరూ ఔరా ఎంత సాహసం? అనేలా మల్లి మెళ్ళో పచ్చటి పవిత్రమైన మాంగల్యం కట్టాడు జస్వంత్. జస్వంత్ లెటర్ అందుకొని పెళ్ళికొచ్చిన అన్నపూర్ణమ్మగారు మల్లికి తల్లిలా అన్నీ దగ్గరుండి చేస్తుంటే సౌమ్య అడబిడ్డ హోదాలో అన్నయ్యదగ్గర లాంఛనాలన్నీ వసూలుచేసుకుంటూ వదిన్ని వుడికిస్తూ పెళ్ళి సందడంతా తనదేనన్నట్లుగా తిరిగింది.

మల్లి కథవిన్న మురళి జస్వంత్ చేసిన పనికి మనస్ఫూర్తిగా అభినందించాడు. "మీది ఆదర్శవివాహంరా జస్వంత్ రక్త సింధూరంతో మీ బంధాన్ని మరింత పటిష్టం చేసుకున్నావు. నా మట్టుకునాకు యింత చక్కటి అవకాశమొస్తే నేనూ వదిలిపెట్టను" అంటున్న మురళిని వుడి




కిస్తూ "చిన్నన్నయ్యా! అన్నయ్య పెళ్ళి ఎలాగూ మావయ్యగారమ్మాయితో నిశ్చయమైందిగా, అందుకే ధైర్యంగా సంస్కర్తనయ్యే అవకాశమొస్తే అవుతా నంటున్నాడు. ఎలాగూ ఆ అవకాశం లేదని తెలిసే కోతలు కోస్తున్నాడు" అంటున్న సౌమ్యను కొట్టడానికి మురళి లేవగానే కిలకిల నవ్వుతూ జస్వంత్ వెనక చేరింది.

వుక్రోషంగా సౌమ్యవైపు చూస్తూ "చిన్నన్నయ్యను అడ్డం పెట్టుకొన్నావు కదూ, మనూరు రా, నీ పని చెబుతా" అంటూ తర్జని చూపిస్తున్న మురళినిచూసి పెద్దగా నవ్వుతూ "వెనకటికి నీలాటి వాడే వోడిపోయి. పారిపోతూ "మా వూరు రా నీ పని చెబుతానన్నాడట" అంటున్న జస్వంత్ నవ్వుతో శృతి కలిపింది సౌమ్య.

ప్రక్క గదిలో మంగళప్రదంగాతన మెడలో మరపురాని మధురానుభూతిని మిగిల్చిన మాంగల్యాన్ని చూసుకొంటూ ఆ భాగ్యాన్ని కలిగించిన జస్వంత్ దివ్య మంగళ రూపాన్ని మనసునిండా నింపుకొని, ఆ అమృతమూర్తి పూజకై చేతులనిండుగా మల్లెలతో ద్వారంవైపే కన్నార్పకుండా చూస్తోంది మల్లి మధురోహల్లో తేలిపోతూ.

———